ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 06.08.2025 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలో విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచుతూ చేసిన బిల్లుకు రాష్ట్రపతి వెంటనే ఆమోదం తెలపాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో మహాధర్నా చేపట్టింది.
2. కామారెడ్డి డిక్లరేషన్‌కు కాంగ్రెస్ పార్టీ తూట్లు పొడిచి, బీసీలను వంచనకు గురి చేస్తోందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శించారు.
3. తెలంగాణ సిద్ధాంత కర్త, ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ఈ రోజు రాష్ట్రవ్యాప్తంగా ఆయనకు నివాళులు అర్పిస్తున్నారు.
4. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని చెబుతూ వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

-------------------------

**కాంగ్రెస్ మహా ధర్నా**

దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహాధర్నా కొనసాగుతోంది. తెలంగాణలో విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచుతూ అసెంబ్లీలో ఆమోదించి రాష్ట్రపతికి పంపిన బిల్లులకు వెంటనే ఆమోదం తెలపాలన్న డిమాండ్‌తో కాంగ్రెస్ ఈ ధర్నా చేపట్టింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు,

డీసీసీ అధ్యక్షులు, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ రాష్ట్రంలో శాస్త్రీయ పద్ధతిలో కులగణన, జనగణన చేపట్టి దాని ఆధారంగా బీసీ రిజర్వేషన్లు కల్పించామన్నారు. అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ల బిల్లును ప్రవేశపెట్టినప్పుడు బీజేపీ ఎమ్మెల్యేలు మద్దతిచ్చారని, ఇప్పుడు దాని వ్యతిరేకిస్తూ ద్వంద్వ వైఖరిని కనబరుస్తున్నారని విమర్శించారు.

**డెస్క్**

-----------------------------

**బండి సంజయ్ – బీసీ రిజర్వేషన్లు**

కామారెడ్డి డిక్లరేషన్‌కు కాంగ్రెస్ పార్టీ తూట్లు పొడిచి బీసీలను వంచనకు గురి చేస్తోందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శించారు. ముస్లింలకు 100 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకే కాంగ్రెస్ పార్టీ జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తోందే తప్ప బీసీల కోసం కాదని అన్నారు. ఢిల్లీ లో తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్‌పై కాంగ్రెస్ మాట తప్పిందన్నారు. మైనారిటీ ఓట్ల కోసం ముస్లిం డిక్లరేషన్ను అమలు చేయాలని భావిస్తోందని ఆరోపించారు.

బైట్: హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

మోదీ ప్రభుత్వం ఇప్పటికే బీసీలకు 27 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తోందని బండి సంజయ్ అన్నారు.

**పీటీసీ, కరీంనగర్**

-----------------------

**బీఆర్ఎస్ వాయిదా తీర్మానం**

గోదావరిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించే బనకచర్ల ప్రాజెక్టుపై చర్చించాలని రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీలు వాయిదా తీర్మానాలను రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్‌కు అందజేశారు. రాజ్యసభ సభ్యులు కేఆర్ సురేష్ రెడ్డి, దీవకొండ దామోదర్ రావు ఈ వాయిదా తీర్మానాలను ఇచ్చారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణ ప్రజల ప్రయోజనాలకు నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు.

**డెస్క్**

-----------------------

కళ్యాణ్ అన్న యోజన

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ పథకాలు పేద మధ్యతరగతి ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని, రాజన్న సిరిసిల్ల జిల్లా  సిరిసిల్ల పట్టణానికి చెందిన చింతోజీ భార్గవి చెప్పారు. ఆకాశవాణి ప్రతినిధితో  ఆమె మాట్లాడుతూ..

<u>బైట్: చింతోజీ భార్గవి</u>

**పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా**

-----------------------

నాగార్జున సాగర్

నాగార్జునసాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం నుంచి దాదాపు 50వేల క్యూసెక్కుల వరద నీరు వస్తుండడంతో కుడి ఎడమ కాలువలకు తోపాటు ప్రధాన విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి ద్వారా మొత్తంగా 44వేల క్యూసెక్కుల నీటిని బయటకు వదులుతున్నారు. వరద నీరు తగ్గిపోవడంతో ప్రాజెక్టు క్రస్ట్ గేట్లను మూసివేశారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 587.70 అడుగులకు చేరింది. శ్రీశైలం కు కూడా

వరద నీరు తగ్గిపోవడంతో కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి చేయడం ద్వారా దాదాపు 55వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

**పీటీసీ నల్లగొండ జిల్లా**

-------------------------

ప్రొఫెసర్ జయశంకర్ జయంతి

ఈ రోజు తెలంగాణ సిద్ధాంత కర్త, ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఆయనకు నివాళులు అర్పిస్తున్నారు. తెలంగాణ ఉద్యమ కాలంలో ప్రజలను చైతన్యం చేసి ఉద్యమ రథసారథిగా మార్గనిర్దేశం చేశారు. మలి దశ ఉద్యమానికి దిక్సూచిగా తెలంగాణ జన హృదయాల్లో చిరస్మరణీయులుగా నిలిచిపోయారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. స్వరాష్ట్ర సాధన కోసం జీవితాన్ని ధారపోసిన త్యాగధనుడు అని కొనియాడారు.

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ ఉద్యమాన్ని రాష్ట్ర సాకారం దిశగా నడిపించారని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలు, స్ఫూర్తిని కొనసాగించడమే ఆయనకు అందించే అసలైన నివాళి అని బీఆర్ఎస్ అధ్యక్షుడు కె. చంద్రశేఖరరావు అన్నారు.

**డెస్క్**

-------------------

ప్రొఫెసర్ జయశంకర్ - జిల్లాలు

జీవితమంతా  తెలంగాణ ఉద్యమానికి, స్వరాష్ట్ర ఏర్పాటుకు అంకితం చేసిన  గొప్ప విద్యా వేత్త ఆచార్య జయశంకర్ అని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా  పేర్కొన్నారు.

తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడానికి ప్రొఫెసర్ జయశంకర్ ఎంతో కృషి చేశారని నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ అన్నారు.

ఆసిఫాబాద్ జిల్లా కలెక్టరేట్ లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్ ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు.

తెలంగాణ ఉద్యమానికి ఆచార్య జయశంకర్ వెన్నెముకగా నిలిచారని పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష పేర్కొన్నారు.

**పీటీసీలు**

-------------------

**వాతావరణం**

వచ్చే అయిదు రోజుల పాటు రాష్ట్రంలో పలు చోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వాతావరణ విభాగం అన్ని జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఈ రోజు వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిచే అవకాశం ఉందని అంచనా వేసింది. అన్ని జిల్లాల్లోనూ ఉరుములు మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని వెల్లడించింది.

**పీఎస్**

--------------------------

భువనగిరి – వాగులు

యాదాద్రి భువనగిరి జిల్లాలో నిన్న రాత్రి నుంచి కురుస్తున్నవర్షాలకు పలుచోట్ల వాగులు పొంగిపొర్లుతున్నాయి. మోటకొండూరు, ఆలేరు, వలిగొండ మండలాల్లో ఈ ప్రభావం తీవ్రంగా ఉంది. వరద నీరు రహదారులపైకి చేరడంతో కొన్నిచోట్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. తట్టు ప్రాంతాలవైపు వర్షపు నీరు చేరుతున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

**పీటీసీ - యాదాద్రి భువనగిరి**

---------------------

రాజన్న జిల్లా - కలెక్టర్

విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వం పెరగాలని, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. జిల్లాలోని తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలను కలెక్టర్  ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన మౌలిక వసతులను పరిశీలించారు.

**పి టి సి రాజన్న సిరిసిల్ల జిల్లా**

-----------------------

**వికారాబాద్ జిల్లా – పోలింగ్ కేంద్రం**

వికారాబాద్ జిల్లాలో పోలింగ్ కేంద్రాలకు బూత్ స్థాయి అసిస్టెంట్లను నియమించడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు అదనపు కలెక్టర్ సుధీర్ సూచించారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణకు సన్నాహాలు, కొత్త పోలింగ్ స్టేషన్ ఏర్పాటుతో పాటు

భవనాల గుర్తింపు తదితర అంశాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఈరోజు సమావేశం నిర్వహించారు.

**పీటీస - వికారాబాద్**

-----------------

**డీవార్మింగ్**

పిల్లల్లో శారీరక ఎదుగుదలను నిరోధించే నులి పురుగుల నివారణ కోసం ఆగష్టు 11న జాతీయ నులి పురుగుల దినోత్సవం నిర్వహిస్తారు. నులిపురుగుల నివారణకు ప్రభుత్వం అందిస్తున్న ఆల్బెండజోల్ 400 మిల్లీ గ్రాముల మాత్రలు వేయాలని నల్లగొండ జిల్లా ఎల్లారెడ్డిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మమత తెలిపారు.

**బైట్... డాక్టర్ మమత, మెడికల్ ఆఫీసర్**

**పీటీసీ నల్లగొండ జిల్లా......**

--------------------------

గద్దర్ వర్ధంతి

ఈ రోజు ప్రజా యుద్ధనౌక, గాయకుడు గద్దర్ – గుమ్మడి విఠల్ రావు వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. తన ఆట, పాటతో ప్రజలను చైతన్య పరిచి తుది శ్వాస వరకు ప్రజల పక్షాన నిలిచారని కొనియాడారు. తరతరాలకు ఉద్యమస్ఫూర్తిని అందించారని పేర్కొన్నారు.

**డెస్క్**

--------------------